www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 13 డిసెంబర్ 2024
5
అన్నమయ్య



సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టుకు 'ఆదిత్య' విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లి

జెఎన్‌టియుఎ సౌత్‌జోన్ ఫుట్‌బాల్ జట్టుకు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల బి.టెక్ ఇసిఇ రెండో సంవత్సరం విద్యార్థి శశికుమార్ ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 16న కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికమవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు రావాలని విద్యార్థిని అభినందించారు. కళాశాల చైర్మన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, ఇసిఇ విభాగం వెంకట వరప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు ఆర్.సురేంద్రబాబు, బి.మోసెస్ ప్రవీణ్ ఎస్.జబీవుల్ల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, తన సహచర విద్యార్థులు శశి కుమార్‌ను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం



నూతన రేషన్ కార్డుల కోసం జిల్లాలో అర్హులు ఎదురు చూస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో 5,04,824 రేషన్ కార్డులున్నాయి. గతంలో ప్రతి ఆరు నెలలకు (డిసెంబర్, జూన్) ఒకసారి రేషన్ కార్డులో పేర్లు మార్పులు, చేర్పులు నూతన రేషన్ కార్డులు మంజూరు చేసేవారు. అందులో భాగంగా 2024 జూన్‌లో ప్రభుత్వం మారడం వల్ల రేషన్ కార్డులు మంజూరు చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా ఇంతవరకు రేషన్ కార్డుల పైన ఎటువంటి స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కొత్త రేషన్ కార్డుల జారీ ఎప్పుడో?

- అందుబాటులోకి రాని అప్‌లోడ్ సైట్
- ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులే కీలకం
- ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి - రాయచోటి

ఈ నెల 2న ప్రారంభించి 28 నాటికి పూర్తి చేయటంతో పాటు సంక్రాంతి పండుగ నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దరఖాస్తులు అప్‌లోడ్ ప్రక్రియ ఇంకా ఎక్కడ కూడా ప్రారంభం కాలేదు. గతంలో రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరిగేది. వైసిపి ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు మాత్రమే కార్డులు పంపిణీ ప్రక్రియ నిర్వహించింది. ఈ పరిస్థితిని చక్కదిద్దుతామంటూ ఎన్నికల ముందు అప్పుటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. మహాకూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా రేషన్ కార్డులపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. మరోపక్క బోగస్ పేరుతో పింఛన్లు కూడా తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు రేషన్ కార్డులు ఆదాయ పరిమితుల బట్టి మంజూరు చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో ఆదాయ పరిమితిని అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ యథావిధిగా జరుగుతోంది. త్వరలోనే సైట్ ప్రారంభం కానుంది అని అధికారులు చెబుతున్నారు. గతంలో గత వైసిపి ప్రభుత్వంలో సచివాలయాలలోని రేషన్ కార్డులను దరఖాస్తు చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం సచివాలయాలకు అప్పజెప్పుతోందా లేక తహశీల్దార్ కార్యాలయాలకు అప్పచెప్పుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం గ్రామీణ, అర్బన్ ప్రాంతాలు వారీగా ఆదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డును రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1,50 లక్షలు, అర్బన్ ప్రాంతంలో రూ.2 లక్షలల్లోపు వార్షిక ఆదాయాన్ని ఆధారంగా కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చుతున్నట్లు సమాచారం. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్తగా పెళ్లయిన వారికి కార్డులు జారీ చేయనున్నారు. ఇప్పటికే వారి కుటుంబానికి ఉన్న రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించేందుకు స్ప్లిట్ ఆప్షన్లు కల్పించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివాహ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా కొత్త జంటకు రేషన్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా వినియోగంలో లేని కార్డులను తొలగించి, కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన రేషన్ కార్డులు వెబ్సైట్ ప్రారంభించాలని నూతన వివాహ జంటలు, పింఛన్ దారులు కోరుతున్నారు.

ఏడాదిగా ఎదురు చూస్తున్నాం



నాకు వివాహమై ఏడాది పూర్తయింది. అప్పటి నుంచి నూతన రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నాం. సచివాలయంలో పలుమార్లు తిరిగిన వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నూతన రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి.

- ఎ.రాజేష్, చీమలచెరువుపల్లి, గాలివీడు మండలం.

ఉత్తర్వులు రావాల్సి ఉంది



నూతన రేషన్ కార్డుల కోసం ఉత్తర్వులు అధికారికంగా వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం. అంతవరకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగవద్దు. సోషల్ మీడియాలో వచ్చే వాటిని ఎవరు నమ్మొద్దు. వెబ్‌సైట్ త్వరలో ప్రారంభమైన వెంటనే రేషన్ కార్డులో సభ్యులు మార్పులు చేర్పులు నూతన రేషన్ కార్డులు అన్ని రకాల మార్పులు చేసుకోవచ్చు.

- కె.రఘురాం, జిల్లా పౌరసరఫరాల అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం

- రైల్వేకోడూరులో 88.8 మి.మీ వర్షపాతం

ప్రజాశక్తి - రాయచోటి

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపలేని వర్షం కురుస్తుంది. అన్నమయ్య జిల్లాలో గురువారం ఉదయం నుండి మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం రాత్రి 8 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 24.36 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాలివీడు 23.0, చిన్నమండెం 30.6, సంబేపల్లి 27.6, సుండుపల్లె 27.4, రాయచోటి 21.8, లక్కిరెడ్డిపల్లి 7.8, రామాపురం 8.6, వీరబల్లె 16.6, నందలూరు 22.0, పెనగలూరు 30.6, చిట్వేల్ 43.6, రాజంపేట 28.0, పుల్లంపేట 31.4, ఓబులవారిపల్లి 57.0, రైల్వేకోడూర్ 88.8, ములకలచెరువు 11.0, తంబళ్లపల్లె 12.0, పెద్ద మండ్యం 16.0, గుర్రంకొండ 19.4, కలకడ 27.8, కేవీ పల్లి 33.8, పీలేరు 33.4, కలికిరి 29.2, వాల్మీకిపురం 20.6, కురబలకోట 17.2, పెద్ద తిప్ప సముద్రం 2.0 బి. కొత్తకోట 7.0, మదనపల్లి 15.2, నిమ్మనపల్లి 23.6, రామసముద్రం 14.8, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

నేడు పాఠశాలలకు సెలవు : జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు, జూనియర్ కళాశాలకు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ గురువారం తెలిపారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తూ, ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు.

యువత కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- పర్యాటక శాఖ ఆర్‌జెడి డాక్టర్ రమణ ప్రసాద్

ప్రజాశక్తి-పీలేరు

పర్యావరణ, పర్యాటక శాఖల్లో ఎన్నో అవకాశాలున్నాయని, యువత వాటిని అందిపుచ్చుకుంటూ అభివృద్ధి చెందాలని పర్యాటక శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్ తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో గురువారం పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పర్యావరణ, పర్యాటకం, స్థిరమైన అభివృద్ధి పోకడలు, అవకాశాలు, సవాళ్లు' అన్న అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అవకాశాల కోసం చేసే ప్రయత్నంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై కీలక ఉపన్యాసం చేసిన పాండిచ్చేరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.వెంకటరావు మాట్లాడుతూ పర్యావరణ, పర్యాటకాలు 1990వ దశకంలో 20 నుండి 30 శాతం మేరకు అభివృద్ధి నమోదు చేసిందని, ప్రపంచ తలసరి ఆదాయాన్ని 6 శాతానికి పెంచడం సాధ్యమైందని తెలిపారు. అంతేకాకుండా పర్యావరణ, పర్యాటకం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని వీటన్నింటిని విద్యార్థులు అందిపుచ్చుకుని పేదరిక నిర్మూలనలో పాలు పంచుకోవాలని సూచించారు. పర్యావరణ పర్యాటకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ భవిష్యత్ తరాలకు అవసరమైన సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆసియా ఖండంలో పర్యావరణ పర్యాటకానికి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. పర్యావరణ పర్యాటకానికి సంబంధించి యూరప్ ఖండం నుంచి ఎన్నో విషయాలను మనం అవలంభించవచ్చని తెలిపారు. భారత ప్రభుత్వం జూన్ 2023లో అమృత్ దరోహర్ పథకం ద్వారా పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం కోసం నడుం బిగించిందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత పొడవైన తీరరేఖ, అటవీ విస్తీర్ణం, కొండ ప్రాంతాలు, నదులు వంటివి ధృతమైన భౌగోళిక పరిస్థితుల వలన ఆంధ్ర రాష్ట్రానికి పర్యావరణ పర్యాటకంలో బంగారు భవిష్యత్తు ఉందని, దాన్ని ప్రభుత్వాలు చక్కని ప్రణాళికలతో సద్వినియోగం చేసుకుని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని తెలియజేశారు. సదస్సులో భాగంగా కన్వీనర్ లెఫ్ట్ నెంట్ డాక్టర్ వెంకట రమణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, దేశంలో పర్యావరణ పర్యాటకానికి సంబంధించి చాలా అవకాశాలు ఉన్నాయని వాటన్నింటినీ చర్చించి ప్రభుత్వానికి అవసరమయ్యే పాలసీకి సంబంధించి నివేదిక అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గుల్బర్గా, కేంద్రీయ విశ్వవిద్యాలయం, వాణిజ్య శాస్త్ర ఆచార్యులు గంగినేని రంగనాథం మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పర్యాటకానికి ఆదరణ పెరుగుతోందని, భౌగోళిక వైవిధ్యం అధికంగా ఉన్న భారతదేశానికి ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమానికి ఆచార్య రంగనాథం వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ఆచార్యులు, పరిశోధకులు అధ్యాపకులు మధ్యాహ్నం జరిగిన సదస్సులో వివిధ అంశాలపై పాత్ర సమర్పణ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివరామ రెడ్డి, రఫీ, సంధ్య ఆదూరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




జాతీయ సదస్సు కరదీపికను ఆవిష్కరిస్తున్న అతిథులు

వైద్యం పేరుతో అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు

- అడిషనల్ డిఎంహెచ్ఒ శైలజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రయివేట్ వైద్య సంస్థలు వైద్యం పేరుతో అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ హెచ్చరించారు. పట్టణంలో ప్రయివేట్ ఆసుపత్రులను, స్కాన్ సెంటర్లు, మదనపల్లి ఆసుపత్రిలో టిబి, లెప్రసి, ఎచ్ఐవి, బ్లడ్ బ్యాంకులను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ ప్రయివేట్ ఆసుపత్రులను, స్కాన్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశామని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను, రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఫైర్ ఆక్సిడెంట్ జరిగినప్పుడు ఎలా జాగ్రత్తలు తీసుకొంటారో సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. సిబ్బందికి ఫైర్ యాక్సిడెంట్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి టిబి, ఎచ్ఐవి, లెప్రసి, బ్లడ్ బ్యాంక్ విభాగాలను తనిఖీ చేసి అక్కడ రిజిస్టర్లను పరిశీలించారు. ఓపికి వస్తున్న పేషంట్లలో క్షయ లక్షణాలు కల వారిని గుర్తించి టెస్టింగులు సంఖ్య పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరవైజర్లు దయాలన్, ఎస్.ప్రభాకర్, శాంతి, టిబి విభాగం సిబ్బంది సుశీల, వనజ కుమారి, తరుణ్, సునీత, జయకుమార్,పుల్లయ్య, పురుషోత్తం, లీలా, భరత్, సుబ్బారెడ్డి, దీప్తి పాల్గొన్నారు.



టిబి యూనిట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ శైలజ

ఉరుస్తున్న పాఠశాల భవనం.. అవస్థల్లో విద్యార్థులు

- ఎంపిడిఒకు గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం పంచాయతీ దండు వారిపల్లి ప్రభుత్వ పాఠశాల భవనం ఉరుస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు గురువారం స్థానిక ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎంపిడిఒ మనోహర రాజు దండువారిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాఠశాలలోకి వర్షపునీరు చేరుకోవడంతో విద్యార్థులను ఇళ్లకు పంపించేసినట్లు గ్రామస్థులు తెలిపారు. పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణం ఆగిపోయిందని, త్వరతిగతిన భవన నిర్మాణం పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ మనోహర రాజు మాట్లాడుతూ నిర్మాణ దశలో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కోసూరి చంద్రమౌళి, టిడిపి నాయకులు పివి నారాయణ, మురళి, గంగులప్ప, దండువారిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉరుస్తున్న భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ మనోహరరాజు

జిఒ 145ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

కోర్టుల సంఖ్యను తగ్గించే జిఒ 145ను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రెడ్డయ్య, సహాయ కార్యదర్శి నాగముని పేర్కొన్నారు. గురువారం రాష్ట్రంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఉన్న ఫస్ట్ ఎడిజె కోర్టుల్లో ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులకు అవకాశం లేకుండా ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 145 ను తక్షణ రద్దు చేయాలని రాయచోటి న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం వారు కోర్టు విధులను రెండు రోజులు బహిష్కరించి అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను కలిసి జిఒ రద్దుకు తాము చేస్తున్న ఆందోళనను ప్రభుత్వానికి వివరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో వల్ల రాష్ట్రంలోని 26 జిల్లాలలో కూడా భవిష్యత్తులో ఎన్‌డిపిఎస్ యాక్టు ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాలలో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తానికి తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉంటుందని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఎన్‌డిపిఎస్ కేసులు కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే ఈ కేసులు ట్రైల్ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని వల్ల కక్షిదారులు ప్రతి వాయిదాకు సుదూర ప్రయాణం చేసి కోర్టులకు హాజరు కావాల్సి వస్తుందని ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోయారు. దేశవ్యాప్తంగా కేసులు సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ అదే తరహాలో కోర్టుల సంఖ్య పెంచాల్సి ఉండగా మన ప్రభుత్వాలు మాత్రం కోర్టుల సంఖ్యను తగ్గిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం లేకుండా కక్షి దారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టీ. ఈశ్వర్ సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్‌రాజు, ధనుంజయ్ కుమార్, చిన్నయ్య, రామాంజులు, మిఠాయి ఖాదర్ బాషా, వరలక్ష్మి, ఆనంద్ ఉత్తేజ్ కుమార్ పాల్గొన్నారు.




జెసి ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

విజయవాడకు తరలిన రైతులు, ఉద్యోగులు

ప్రజాశక్తి-రాయచోటి

ఇందిరాగాంధీ స్టేడియంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుచే స్వర్ణ ఆంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం మధ్యాహ్నం జిల్లా నుంచి 310 వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఆదర్శ రైతులు ఏడు బస్సుల్లో విజయవాడకు పయనమయ్యారు. శుక్రవారం ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తారు. గురువారం జెసి జెండా ఊపి బస్సుల్లో రైతులను సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, సుసంపన్నమైన భవిష్యత్తుకు స్వర్ణాంధ్ర ప్రణాళిక ఒక దిశ నిర్దేశం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, ఆర్‌డిఒ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, కో-ఆర్డినేషన్ సెక్షన్ సపరింటెండెంట్ నరసింహ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి ఆదర్శ రాజేంద్రన్



పరేడ్‌లో పాల్గొన్న హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రమశిక్షణ తో విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక బీటీ కాలేజ్ మైదానంలో హోంగార్డుల పరేడ్‌ను తనిఖీ చేసి, దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవడంతో పాటు ఏడాదికోసారి మెడికల్ చెకప్ చేసుకోవాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని, డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులను సమర్థవంతంగా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. హోంగార్డ్స్ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత నిస్తామన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ డిఎస్‌పి, మదనపల్లి ఇన్‌ఛార్జి రమేష్, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేశాం : ఎమ్మెల్యే



లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేదవాడి సొంతింటి కల సాకారం చేసిన ఘనత టిడిపిదేనని ఎమ్మెల్యే షాజహాన్ బాష పేర్కొన్నారు. గురువారం మున్సిపల్, టిట్కో అధికారులు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే టిట్కో ఇళ్ల లబ్ధిదారులకు తాళాలను అందజేసి, రిబ్బను కట్ చేసి ఇళ్లను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, లబ్ధిదారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద ఆడపడుచుల సొంతింటి కలలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించుకోమని లబ్ధిదారులను అప్పులుపాలు చేసిందని దుయ్యపట్టారు. ప్రజా పాలన అందించే దిశగా పేదలకు టిట్కో ఇల్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా దేశవ్యాప్తంగా చంద్రబాబు నాయుడు అగ్రస్థానంలో ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల, టిట్కో డిఇ దేవిక, హౌసింగ్ డిఇ రమేష్ రెడ్డి, ఎఇ దీన దయాల్ రాజు, మెప్మా సిఎంఎం మధుసూదన్ రెడ్డి, ఆర్పీలు రాణి, యశోద, జాఫర్నిసా, తెలుగుదేశం నాయకులు శ్రీనివాసులు నాయుడు, బెల్లే రెడ్డి ప్రసాద్, షంషీర్, నాగూర్ వలి, రఘుపతి నాయుడు, కమలామర్రి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు తలారి రాధమ్మ, పులి మహాలక్ష్మి, కవిత, నాగమణి, రెడ్డి బూ, బొమ్మిశెట్టి పురుషోత్తం, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ

సుస్థిర గ్రామాల ఏర్పాటుకు కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

సుస్థిరమైన గ్రామాలు ఏర్పాటు చేయడానికి తొమ్మిది టీమ్‌లు సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ సిఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ సభా భవనంలో అధికా రులు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, గ్రామాల్లో పరి సరాల పరిశుభ్రత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, ఎపిఒ, ఐసిడిఎస్ సూపర్ వైజర్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. **చిన్నమండెం:** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై మండల స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి మండలానికి సంబంధించి అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని గ్రామ సచివాలయాల నుంచి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం 19న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. ఈ సమావేశానికి మండలం లోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చలితీవ్రత పెరగడంతో చలికాలం దృష్టిలో ఉంచుకుని బి.కొత్తకోటలో గుడారాల్లో నివాసం ఉంటున్న అభాగ్యుల కోసం మేమున్నామంటూ హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఫయాజ్, ఆరిఫ్, అబ్దుల్ రెహ్మాన్, సింహాద్రి, ఇంతియాజ్, దాదు, పోలీస్ సిబ్బంది రమణ, హేమంత్ దుప్పట్లను అందించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు అబూబాకర్, సిద్ధిక్ మాట్లాడుతూ ఇప్పటికే తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, ముందు సేవలను మరింత విస్తృతం చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్నా హెల్పింగ్ మైండ్స్ సంస్థను సంప్రదించాలని పిలుపునిచ్చారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలోనే వాహనాల రాకపోకలు

ప్రధాన రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

- రాకపోకలకు అంతరాయం..పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలో కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న పింఛా-రాయచోటి ప్రధాన రోడ్డులో గత రెండు రోజులు కురిసిన వర్షానికి వర్షపు నీటితో నిండిపోయి వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజంపేట, పింఛా, రాయవరంకు ఈ రోడ్డు ద్వారానే వెళ్లాలని రోడ్డులో బురద నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహన దారులు పేర్కొంటున్నారు. నిత్యం మండల అధికార పార్టీనాయకులు, మండల అధికారులు ఈ రోడ్డు ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లు పోతున్నారని అన్నారు. సుండుపల్లె-రాయచోటి ఆర్‌టిసి బస్సులకు వచ్చిన ఆదాయం ఏ మండలంలో కూడా రాదని అయినా కూడా రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రోడ్డు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో నెలకొన్న వాల్మీకుల సమస్యలను పరిష్కరించాలని వాల్మీకి సేవా సమితీ అధ్యక్షులు విష్ణుచైతన్య అన్నారు. గురువారం మండలంలోని కుందేళ్లవారిపల్లిలో వాల్మీకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కుందేళ్లవారిపల్లికి రోడ్డు వేయాలని ఎన్నో సంవత్సరాలుగా అడుగుతున్నా.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఇంత వరకు ఎవ్వరూ పట్టించుకున్న పాపానపోలేదని మండిపడ్డారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆ సంఘం అధ్యక్షులు విష్ణుచైతన్య మాట్లాడుతూ కుందే ళ్లవారిపల్లికి నెలకొన్న రోడ్డు సమస్యను వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, రంజిత్, రామచంద్ర, భార్గవ్, రాజేష్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి-వీరబల్లి

పోలీసు బందోబస్తు నడుమ వంగిమళ్ల పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గురు వారం డిఎల్‌పిఒ మస్తాన్‌వలి విచారణ చేపట్టారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పనులు చేయకుండా సర్పంచ్, అధికారులు స్వాహా చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వారి, డిపిఒ ఆదేశానుసారం విచారణకు డిఎల్‌పిఒను పంపారు. ఘర్షణ జరిగే అవకాశం ఉన్నందున ముందస్తుగా రాయచోటి గ్రామీణ సిఐ వరప్రసాద్ ప్రత్యేక బలగాలతో వంగిమళ్ల సచివాలయం వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. వీరబల్లి ఎస్ఐ మోహన్‌నాయక్, సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం, సుండుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తును పర్యవేంచారు. అనంతరం డిఎల్‌పిఒ ఫిర్యాదు దారుడైన కల్లూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లి కార్జున సమక్షంలో రికార్డులు తనిఖీ చేసి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలని డిఎల్‌పిఒను ప్రతాపరెడ్డి కోరారు. ప్రస్తుతం రికార్డుల మేరకు చూస్తామని ఆన్‌లైన్ ఉన్న వివరాలు తీసుకొని విచారించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. అనంతరం డిఎల్‌పిఒ మస్తాన్ వలి విలేకర్లతో మాట్లాడుతూ ముందుగా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి నోటీసులు అందించి విచారణ చేశామని చెప్పారు. కొన్ని పనులకు ఎం బుక్‌లు ఉన్నాయని, ఇంజినీరింగ్ అధికారుల చేత రికార్డు చేయబడిన కొన్ని పనులు, ఓచర్‌లు కూడా ఉన్నట్లు తెలిపారు. కొన్ని ఓచర్ల మీద పంచాయతీ సెక్రెటరీ సంతకాలు లేవని, అవి పరిశీలించి అధికారులకు తెలియజేసిన తర్వాత తుది నివేదిక తయారు చేస్తామన్నారు. ప్రస్తుతం ఫిర్యాదు దారుడు ఇచ్చిన మేరకు నమోదు చేసుకున్నామని రికార్డులు ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారం మేరకు విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

గ్రామాల్లో పనులు చేయకుండా రూపాయి కూడా డ్రా చేయలేదు

గ్రామంలో పనులు చేయకుండా రూపాయి కూడా డ్రా చేయలేదని వంగిమళ్ల సర్పంచ్ తమ్ముడు జయ రెడ్డి, మధుసూదన్ రెడ్డి అన్నారు. గ్రామ అభివృద్ధిని కోరి వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చామని అన్నారు. లేనిపోని నిందలు వేసి తమపై బురద చల్లాలని చూస్తున్నారని చెప్పారు. రికార్డులు లేకుండా పనులు చేసి బిల్లులు చేసిన ప్రసక్తే లేదన్నారు. వంగిమళ్ల అభివృద్ధి కోసం టిడిపి తరపున తనశాయ శక్తుల కృషి చేస్తానన్నారు. మేము తప్పు చేసి ఉంటే శిక్షించాలని అన్నారు. తాము టిడిపిలో చేరడంతో కొందరిలో భయం పుట్టుకుందని అన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ మస్తాన్ వలి

నిధులు దుర్వినియోగం బయటపతుంది

వంగిమళ్ల గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియో గమైనట్లు అధికారుల విచారణలో బయటపడుతుందని టిడిపి నాయకులు కల్లూరి ప్రతాప్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ కల్లూరి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. వారు టిడిపి నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో అభివృద్ధి పేరు చెప్పి గ్రామ సర్పంచ్ లక్షలలో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గ్రామంలో వివిధ పనులు చేసినట్లు రికార్డులలో పొందు పరిచారుగానీ అందుకు సంబంధించిన ఎలాంటి బిల్లులు, రశీదులు లేకపోవడంతో పాటు గ్రామ కార్యదర్శి సంతకాలు లేకుండానే బిల్లులు స్వాహా చేయడం చూస్తుంటే అవినీతి ఏ మేరకు జరిగిందో అర్థమవుతుందన్నారు. కేవలం రికార్డుల పరిశీలనలోనే అవినీతి జరిగిందని తెలుస్తుందంటే గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ చేస్తే మరింత అవినీతి బయటపడే అవకాశం ఉందన్నారు. గ్రామ నిధులను దుర్వినియోగం చేసిన గ్రామ సర్పంచ్‌పై, అందుకు సహకరించిన అధికారులపై ఉన్నత స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించండి : ఎమ్మెల్యే



మదనపల్లి: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. గురువారం మండలంలోని సిటిఎం -1 గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు భూ సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములు, పేదల భూములను కాపాడడమే ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎవరైనా రైతులు వారి భూములకు పట్టాదారు పాసుబుక్‌లు మంజూరు కాకుండా, ఆన్‌లైన్ కాకుంటే ఈ సదస్సుల్లో అర్జీలు సమర్పిస్తే వెంటనే వాటిని రెవిన్యూ అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద పార్థసారథి, టిడిపి నాయకులు రెడ్డి రాంప్రసాద్, చల్లా నరసింహులు, మిట్టపల్లి రాజు, వెలుగు చంద్ర పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని నవాబుపేట సచివాలయం పరిధిలో రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు డిప్యూటీ తహశీల్దార్ భార్గవి తెలిపారు. గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు భూములకు సంబం ధించిన భూముల ఆన్‌లైన్ కోసం 17 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సద స్సులను గ్రామీణ ప్రాంతాలను రైతులు వినియోగిం చుకుని వారి భూములపై ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గతంలో జరిగిన భూ సమస్యలు పరి ష్కారం కాని వాటిని ప్రస్తుతం పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు వినియో గించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ దేవి, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలోని గుండ్లపల్లె, వేమారెడ్డిగారిపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. నోడల్ ఆఫీసర్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, తహశీల్దార్ హరికుమార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 10అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 10 డీకేటి పట్టాలు మంజూరు చేయవలసినదిగా, 4 ఇంటి పట్టా మంజూరు కోసం, 2 భూ సర్వే, ఒకటి అన్నాగారిపల్లె గ్రామమునకు స్మశనమునకు, ప్రభుత్వ భూమి కేటాయించవలసినదిగా వచ్చినట్లు తెలిపారు. 6 రెవెన్యూ రికార్డుల నమోదు కొరకు ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఈ సదస్సులు సబ్ రిజిస్ట్రర్ ఉదయ్ కిరణ్ రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామ్‌రాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. **గాలివీడు:** మండలంలోని తూముకుంట సచివాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 66 దరఖాస్తుల అందినట్లు తహశీల్దార్ జై భాగ్యలత పేర్కొన్నారు. ప్రజలు నుంచి వచ్చి ఫిర్యాదులను పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు.



కలకడ : రెవెన్యూ సదస్సుకు హాజరైన డిటి, సిబ్బంది

బీమా ప్రీమియం తగ్గించాలని వినతి



ఉద్యానశాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న టిడిపి,జనసేననాయకులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మామిడి తోటలను సాగుచేస్తున్న రైతులకు పంటల బీమా ప్రీమియంను రూ.2250 నుంచి రూ.500 వరకు తగ్గించి ఆదుకోవాలని టిడిపి, జనసేన కూటమి నాయకులు సుండుపల్లి మండల కేంద్రంలో ఉద్యానవన అధికారి వనితను కలిసి వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం మామిడి, పండ్ల తోటలకు సంబంధించి రైతులు ప్రతి ఎకరాకు రూ.2250లు బీమా ప్రీమియం నిర్దేశించిందని అన్నారు. గత నాలుగైదు ఏళ్లుగా మామిడి తోటలు చీడ పీడలు ఎక్కువై రైతులు ఆదాయం కోల్పోయారని అన్నారు. తోటలు దుక్కి దున్నుకోవడానికి మందులు పిచికారీ చేసుకోవడానికి కూడా డబ్బులు లేక ఆర్థికంగా దీనవస్థలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం మామిడి రైతులపై సానుకూలంగా స్పందించి భారీ మొత్తంలో లేకుండా ఎకరాకు రూ.500 బీమా ప్రీమియంను నిర్ణయించాలని కోరారు. లేకుంటే రెండు మూడు సంవత్సరాలలో మామిడి తోటల చేతికి రాకుండా కనుమరుగయ్యే ప్రమాదముందని అన్నారు. ఇప్పటికే చిట్వేలి మండలంలో మూడు వందల ఎకరాలు కనుమరుగయ్యాయని అన్నారు. ప్రభుత్వం మామిడి తోటల రైతులను రక్షించి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే దళారు వ్యవస్థతో మార్కెటింగ్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు ఇన్సురెన్స్ కట్టుకోలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వం మామిడి తోటల రైతులను అదోకోకపోతే కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సంఘం అధ్యక్షులు సుబ్బరామరాజు, జనసేనపార్టీ రాజంపేట పార్లమెంటు నాయకులు రామ శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, టిడిపి నాయకులు ఆనంద రెడ్డి, ఆనంద్ నాయక్, సుబ్బారాయుడు, జయరామ్, ప్రతాప్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం కార్యాలయ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్యం చేరుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో అసంపూర్తిగా ఉన్న పక్క ఇంటి నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి, హౌసింగ్ ఎఇ వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం జరిగింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మార్చి నెల ఒకటవ తేదీ లోపు పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. ఆర్థిక సమస్య ఉంటే అటువంటి వారికి వెలుగు ద్వారా రూ.30 వేల నుంచి 50 వేల వరకు రుణం మంజూరు చేయించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పనులు పూర్తి కాగానే జరిగిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చొరవ చూపాలన్నారు. లబ్ధిదారులకు నమ్మకం కలిగి పనులు త్వరగా పూర్తి చేసుకోగలరన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, హౌసింగ్ ఎఇ సుజాత, ఆర్డబ్ల్యూఎస్ ఎసి వినోద్ కుమార్ పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపిడిఒ, ఎఇ

పంట కాలువలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : బ్రహ్మసాగర్‌కు సంబంధించి పంట కాలువలు పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం సిపిఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించారు. సిపిఎం సీనియర్ నాయకులు బోలా శ్రీరాములు, హరి, కామ్రేడ్ రవణమ్మ అధ్యక్షత వహించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్రహ్మసాగర్ తెలుగుగంగలో అంతర్భాగంగా నిర్మాణం ప్రారంభమై నేటికీ 39ఏళ్లు అన్నారు. ఇప్పటికీ కూడా బ్రహ్మసాగర్ చివరి ఆయకట్టు వరకు నీటి తడి పంట కాలవలు, పిల్ల కాలువలు పూర్తి చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రూ.1000 కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, మండల నాయకులు ఎస్.గోవింద్, గండి గుర్రయ్య, గండి సునీల్‌కుమార్, అజయ్, సుబ్బమ్మ, పార్టీ శాఖ కార్యదర్శిలు, సభ్యులు పాల్గొన్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మురుగు నీరుతో అవస్థలు

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు మురుగు కాలువలు ఉన్నాయి. ఎడమవైపు ఉన్న మురికి కాలువ, బస్టాండ్‌లోని ఖాజామియా హోటల్ వద్ద మురికి కాలువల నుంచి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి డ్రెయినేజీ కాలువ నిండిపోయి మురుగు నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుందని అన్నారు. ఈ నీరంతా బస్టాండ్ నుంచి పెద్దూర్ రోడ్డు వరకు ప్రవహిస్తూనే ఉంటుందని అన్నారు. వర్షం వచ్చిన ప్రతి సారి మురుగు నీరంతా రోడ్లపై ప్రవహిస్తుండటంతో అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటిపై దోమలు స్వైర విహారం చేస్తుండంతో విషజ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచి మురుగు నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రామాపురం

రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోని సురక్షితమైన ప్రయాణం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి సిఐ కొండారెడ్డి పేర్కొ న్నారు. మండల పరిధిలోని బిట్స్ కళాశాలలో గురువారం రహదారుల భద్రత అవగాహనపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణకు రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు తీసుకునే విధంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఎస్ఐలు, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులను సత్కరిస్తున్న కూటమి నేతలు

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం పెద్దపీట :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆత్మస్థైర్యమే విభిన్న ప్రతిభావంతుల ఆయుధమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని న్యూ ఆంధ్ర కళ్యాణ మండపంలో విభిన్న ప్రతిభావంతుల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటారన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యతని చెప్పారు. జిల్లా స్థాయిలో వారికి అండగా నిలిచేందుకు ముందుంటామన్నారు. రాజంపేటలో విభిన్న ప్రతిభావంతుల భవన నిర్మాణానికి తన వంతు సహకారాన్ని తప్పకుండా అందిస్తామని చమర్తి జగన్‌మోహన్‌రాజు హామీ ఇచ్చారు. అనంతరం క్రీడల్లో రాణించిన వివిధ ప్రతిభా వంతులను వారు ఘనంగా సన్మానించారు. అనంతరం చమర్తి, రమేష్, కృష్ణలను విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం తరపున శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్, ఎంఇఒ రఘునాధ రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షులు గన్నే సుబ్బనసయ్య నాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు దాసరి రాజు వాణి శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి నేటికి 6 నెలలు పూర్తయిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు సూపర్‌గా అట్టర్‌ప్లాప్ అయ్యాయాని విమర్శించారు. నిరుద్యోగభృతి హామీ అమలు కాలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. ఆడబిడ్డ నిధి అడ్రస్ లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ హామీ అమలు కావడం లేదని విమర్శి ంచారు. కూటమి ప్రభుత్వం పాలనలో ఇంటికో పారిశ్రామిక వేత్త కాదు..ఇంటికో తాగుబోతు తయారవుతున్నాడని తెలిపారు. ఉచిత ఇసుక విధానం ఉత్తుత్తిగా మారిందన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించా యన్నారు.

సిపి బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడు

ప్రజాశక్తి - వేంపల్లె : సిపి బ్రౌన్ ఆంగ్లేయుడయినప్పటికీ తెలుగు భాషోద్ధారకుడని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో గురువారం బ్రౌన్ 140వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ దొర తెలుగు భాష నేర్చుకొని, తెలుగు నిఘంటువును రచించి, వేమన పద్యాలు సేకరించి తెలుగు భాషకు ఎనలేని సేవ చేసి తెలుగు సూరీడుగా ప్రకాశించాడని కొనియాడారు. బ్రౌన్ దొర లేకపోయి ఉంటే అమూల్యమైన వేమన పద్యాలు మనకు లభించి ఉండేవి కావన్నారు. తెలుగు భాష అతి ప్రాచీన భాష అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, రాజా, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వినయ్, వెంకటేష్, మహబూబ్ బాషా, బాలం సుబ్బ రాయుడు, బద్రి, రమణ పాల్గొన్నారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం కింద మంజూరు చేస్తున్న మినీ గోకులాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎపిఒ జయభారతి సూచించారు. మండలంలోని గురజాలలో నిర్మించిన మినీ గోకులాన్ని గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశాల మేరకు మినీ గోకులాలను నిర్మించుకోవాలన్నారు. పాడి రైతులకు మినీ గోకులాలను రైతులు 10 శాతం వాటా చెల్లిస్తే 90 శాతం ఉపాధి నిధులతో నిర్మించనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 25 గోకులాలను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ భవాని, లబ్ధిదారుడు రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రామాపురం

అప్పుల బాధతో సానే శివశంకర్ (30) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన సానే శివశంకర్ అప్పులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి కలిగి బుధవారం రాత్రి ఇంటిలోని ఫ్యాన్ కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శివశంకర్‌కు రెండు సంవత్సరాల క్రితం తన అక్క కూతురినే వివాహం చేసుకున్నట్లు తెలిపారు.